# మెఱుపులు: పెద్దన పద్దెము

- వేమూరి వేంకట రామనాథం

వెనుక నొక వ్యాసంలో "పెద్దన యెత్తుగడ"ను విపులీకరించాను, "ఆ పురి బాయకుండు..." పద్యం సమీక్షిస్తూ.

ఆ వరుసలోనే మఱొక చక్కని పద్యం తీసికొని దానిలోని ఉత్కృష్టత సూచించటం ఈ మెఱుపు తలపు. పద్యంలోని చక్కదనం అందలి పదాల మీద, వాటి కలయిక మీద, అవి చదువరి మనసులో రేకెత్తించే స్పందన మీద ఆధారపడి యుంటుందన్న సాధారణీకరణానికి ఇదొక దృష్టాంతం.

ఈ పద్యం అల్లసాని పెద్దన వ్రాసిన "మనుచరిత్ర" లోనిదని ప్రత్యేకంగా చెప్పనక్కఱలేదనుకుంటాను.

పెద్దన పద్యం - బహు విదితమైనది యిది:

ఉ. ఇంతలు కన్నులుండ తెఱువెవ్వరి వేడెదు భూసురేంద్ర, యే
కాంతము నందునున్న జవరాండ్ర నెపంబిడి పల్కరించులా
గింతియె కాక, నీ వెఱుగవే మును వచ్చిన త్రోవ చొప్పు, నీ
కింత భయంబు లేకడుగ నెల్లిద మైతిమె యాడువారమై.

సందర్భం, అతి సూక్ష్మంగా, ఇది: ప్రవరుడు ఇంటికి తిరిగి పోయే తహ తహలో దారి తెలియక, అక్కడ కనపడిన వరూధినిని అడుగుతాడు, నేను "త్రోవ తప్పితిన్", చెప్పుమని. సమాధానంగా ఆమె పల్కిన తొలి పల్కులివి.

ఈ పద్యం లోని సొగసును చర్చించే ముందు అందులోని శబ్దాలను గుఱించిన యొక విషయం తెలిసికొందాం. "భూసురేంద్ర, ఏకాంతము, భయము" అన్న మూడు శబ్దాలను మించి సంస్కృత పదాలులేవీ పద్యంలో. దాదాపు తొలి పద్యమనదగిన "ఆపురి బాయకుండు....." వృత్తంలో "ఆ, బాయకుండు" మించి తెలుగు పదాలు లేవు. అలాగే సంస్కృత పద భూయిష్టం "అట జని కాంచె" "వృత్తం, ఆమూడు తొలిపదాలు తప్పిస్తే. "ఆమందిడి అతడరిగిన పద్యంలో ఆమాటలు, తరువాత భూమీసురు "డరిగె" యన్న యొక్క మాట తప్పిస్తే అన్నీ సంస్కృతపదాలే: "తుహిన భూధర శృంగ......" ఈ వెనుక తెర మనసులో పెట్టుకొని గమనిస్తే, ఈ "ఇంతలు కన్నులుండ" అన్న వృత్తం ఎంత భిన్నశిల్పంగా రూపొందించ బడిందో తెలుస్తుంది. సంభాషణక్రమానికి కొంతగా తగినట్లు ఈ పద్యం కూర్చబడిందేమో అని ఒక సమాపనచేయ వచ్చును.

"సంభాషణ" అన్న దృశ్యసందర్భం మనసులో పెట్టుకొని, చివరి పాదం లోని "యింత" భయంబు అన్న పదసంచయం కూడ ఎంత సరసంగా, మాటల వరుసలో వలె ఉన్నదో మనం గ్రహించ వచ్చును.

ఇలాంటి మాటల కూర్పుగానే పద్యం తొలి శబ్దాలను మనం పరిగణించ వచ్చును - "ఇంతలు కన్నులుండ" అయితే యిక్కడ ఒక అసాధారణ ప్రయోగం ఉన్నది: "ఇంతలు" అన్నది. "ఇంత" అన్న శబ్దానికి "లు" చేర్చి "ఇంతలు" అనే బహువచన ప్రయోగం మఱియే రచనలోను - నాకు తెలిసినంతవఱకు లేదు. "కళ్ళు ఇంత చేసుకు చూశాడు" వంటి ప్రయోగం ఉండవచ్చును, అది సంభాషణ క్రమంలో అసాధారణమైనది కాదు, అని మనం అనుకొన్నా, యీ "యింతలు" అన్నది అతి అసాధారణమైన ప్రయోగంగా మనం పరిగణించాలి. కళ్ళు తెఱచుకొని చూడలేవా, అనటమే కాక, నేవెలా వచ్చావో ఆత్రోవ తెలియదా, అంటుంది వరూధిని: "మును వచ్చిన త్రోవ చొప్పు". పాపం అతడు ఎలా వచ్చినది ఆమెకు తెలియదు గదా. త్రోవ చూసుకుంటూ నడచి వచ్చాడని, అలా వచ్చిన వానికి తిరిగి అదే త్రోవన పోవటం ఎందుకు తెలియదని, అచ్చెరు వందింది. ఇదంతా నటనగా భావించింది, ప్రవరుని ఆకారణంగా దెప్పు మొదలిడింది. నీకు తెలియక కాదు, ఒంటరిగా ఉన్న నన్ను పల్కరించటానికి ఇదొక మిష, అని దూషిస్తుంది. ఏదో "నెపం" తో "జవరాండ్ర" ను సంభాషణలోనికి ఈడ్చటానికి నీవిలా పన్నాగం పన్నావు, అంటుంది. ఈ శబ్దం ఎంత రసవంతంగా వేశాడో మనం గమనించాలి. "జవరాలు" అన్నది "స్త్రీ" కి చెందుతుంది గాని, దాని అర్థం "యౌవనవతి" యని. యౌవనవతులను మాటలలోనికి దింపుటకు నీవు ఇదొక పన్నాగం పన్నావయ్యా, అని ప్రవరుని గదమాయిస్తుంది వరూధిని. అంతేకాదు, వారు "ఏకాంతము నందు" న్న వారని కూడ ప్రత్యేక వర్ణన చేస్తుంది. తాను ఒంటరిగా అక్కడ ఉన్నదని అప్పటికే ప్రవరుడు పసికట్టాడు. అతడు తనను "ఎవ్వతె వీవు , ఒంటి చరించెదోట లేక" అని అంతకు ముందే ప్రశ్నించాడు గదా.

ఈ విధంగా ప్రవరుడు అక్రమమైన చనువు తీసికొని తనను మాటలలోనికి దింపటానికి యత్నిస్తున్నాడన్న సొడ్డు వేస్తుంది.

కథ ఎలా జరుగనున్నదో, తన అంతస్థిత - ఉద్దేశ్యము వాంఛ తనకు దృఢంగా తెలుసు కనుక, తాను ఒంటరిదేయని, "ఏకాంతము నందు" తానున్నది లేయని, వానికి తన నిజస్థితిని, కాముక ప్రవర్తనావకాశాన్ని ధ్వనిస్తుంది. అనగా, దెప్పుతున్నట్లు గానే వానికై వల కూడ వేస్తుంది.

పైగా, నీ "కింతభయం" లేకుండా నన్ను అడగటానికి నేనే కాదు, మేము "ఆడువారము" అంత చులకన అయినామా, అన్న సాధాకరీకరణ కూడ చేస్తుంది. దానిలో కొంత వఱకు అర్థాంతరన్యాసపు చాయలు ఉన్నాయి, అనిపిస్తుంది. "ఇంత భయంబు" లో "ఇంత" మన సాధారణ సంభాషణక్రమం గుర్తు చేస్తుంది; "భయ మేకొలదిగా నైనా లేకుండా నీ యిష్టం వచ్చినట్లు మాటలు మొదలు పెట్ట జూచావు" అన్న భావం ఉట్టి పడుతుంది, యీ మాటల తీరులో.

ఇక ప్రవరుని సంబోధిస్తూ ఆమె ఉపయోగించిన పదం గమనించుదాం: "భూసురేంద్ర". భూసురుడన్న శబ్దం బ్రాహ్మణుని పరంగా వాడటం మన పూర్వ రచయితల సంప్రదాయం. అనగా భూమి మీద దేవతాతుల్యుడు అని "ముక్కస్యముక్క" అర్థం. వాని కింత ఔన్నత్యం ప్రతిపాదించటం తగునా యన్న చర్చతో నాకిక్కడ పనిలేదు. అది మన పూర్వరచనలలో సర్వసాధారణంగా ఉపయోగించబడిన శబ్దమని మాత్రం మనం గ్రహించాలి.

ఈ పద్యంలో వరూధిని ప్రయోగించిన పదం చూడండి, "భూసురేంద్ర" యని. దీనికి సాధారణార్థం ఇలా చెప్పవచ్చును: "భూమి పైని సురలలో అగ్రగణ్యుడు" అని. అయితే, ఈ భావం గల ప్రయోగాలు మిగత పద్యాలు కొన్నింటిలో కేవలం "భూమీసురుడ"ని (ఆమందిడి యత డరిగిన భూమీసురుడరిగె తుహిన .."అన్న పద్యంలో), "భూమీసురుడ"ని ("అటజనికాంచె భూమీసురుడు..." అన్న పద్యంలో) మాత్రం చెప్ప బడింది. ఇక్కడ వరూధిని వానిని "భూసురేంద్ర" అని పిలుస్తుంది. ఇది కేవలం గౌరవ సంబోధనగాను, "ఇంద్ర" శబ్దం కొంత ఔన్నత్య సూచకంగాను మనం అర్థం చేసి కొనవచ్చు. ఇది ఒక విధంగా సబబైనదే కాని, యీ సందర్భం లో ఆసంబోధన కొక ప్రత్యేక "శబ్ద" సార్థక్యం ఉన్నదని నాకు తోస్తుంది. వరూధిని ప్రవరుని సంబోధిస్తున్న సందర్భంలో ఆమెకు ప్రచ్ఛన్నంగా మనసులో గుబులు కలిగిస్తున్న మదన కాంక్ష యున్నది. అది తటాలున తన మాటలలో చెలరేగి, ప్రవరుని చూస్తూ వానిని పిలుస్తూ, "ఇంద్ర" శబ్దం ప్రయో గించింది - ప్రయోగింపజేశాడు పెద్దన. దీని అంతరార్థం ఇలా విశదీకరించవచ్చు.

ఇంద్రుడు స్వర్గంలో కాధిపతియే గాక, నిరంతరం రంభా-ఊర్వశి-తిలోత్తమాది సౌందర్యఖనుల మధ్య మెలగే వాడు. అంతేకాక, వానికి గల కామ వాంఛా ప్రాగల్భ్యం జగద్విదితమే, మునీశ్వరుని భార్య అహల్యను హేయకరమైన పన్నాగం మీద అనుభవించిన మహామహుడు! ప్రవరుని కిలాంటి మనోభావం కలదన్న అన్వయం కాదిక్కడి ముఖ్యవిషయం. అలాంటి కామతృష్ణగల యింద్రునంత గొప్పవాడవని వానిని వరూధిని సంభోధింస్తుంది. ఈ సంబోధనకు సమర్థన తన అంతరం గమే కాని ప్రవరుని చర్యా విశేషము లేవీకావు.

కథ తెలిసిన వారికి ఈ సంబోధనలో గల వరూధినీ వాంఛ, ప్రవరుని పై తనకు గల మదనానురక్తి, స్ఫురించకపోవు. కథ గడచిన కొలది వెనుక పద్యం వంక దృష్టి మఱిలిస్తే యీ "యింద్ర" శబ్ద ప్రయోగం లో గల వైశిష్ట్యం తప్పక స్ఫురిస్తుంది.

ఈ శబ్దవ్యాఖ్యానం ముగించే ముందు ఒక షరా సూచించ వలసియుంది. ఈ వ్యాఖ్యానం ఇచ్చటి సందర్భానికి తగినది అని మనవి చేస్తున్నాను. వరూధిని ప్రవరుని యెడ మోహం కల్గిన "జవరాలు"; వానిని తన వైపు మళ్ళించుకో వలెనన్న ఊహ గల స్త్రీ. "ఎక్కడి యూరు కాల్నిలువకింటికి పోయెద" నందువని ఈసడించబోయే ప్రణయతప్త. ఈ సందర్భ ప్రత్యేకతకు సహకరించే వ్యాఖ్యాన ఆమెయొక్క "ఇంద్ర" శబ్ద సంబోధనను గుఱించి చేయటంలో సాధ్యమయింది. ఈ వ్యాఖ్యాన సందర్భ ప్రత్యేకతను చదువరులు గ్రహించవలెనని కోరుతున్నాను.

ఈ వ్యాసం ముగింపులో ఒక అంశం ప్రత్యేకంగా పేర్కొన వలసియుంది అనుకుంటాను. పద్యమంతా సంభాషణక్రమానికి తగినట్లు కూర్చబడింది. నిజానికి అంతకు ముందు ప్రవరుడు "ఎవ్వతె వీవు..." అన్న పద్యం కూడ ఈ దృశ్యం సంభాషణ భూయిష్టంగా జరిగినదన్న కూర్పులో ఉంది. పదాలు ఎక్కువగా తెలుగువవటమే కాదు, ఆపదాల కూర్పు కూడ సంభాషణ స్ఫోరకంగా ఉంది. కవితకు ప్రాణమైన రసం కేవలం శబ్దం యొక్క పుట్టిల్లు మీద కన్న దాని ఉపయోగంలో గల సార్థక్యం మీద ఆధారపడి యుంటుంది, అన్న సత్యం ఈ పద్యం గుర్తు చేస్తుంది.

****